

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న మునిసిపల్ సిబ్బంది

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

దుండిగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో పార్కులు, కమ్యూనిటీ స్థలాలను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దుండిగల్ పురపాలక సంఘం కమిషనర్ సత్యనారాయణ హెచ్చరించారు బహదూర్‌పల్లిలో సర్వే నంబరు 62/1, 1/ఎ, 6 వందల గజాల స్థలాన్ని కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కేటాయించారు. ఆ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని గురువారం అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పురపాలక సంఘం పరిధిలో ప్రజావసరాల కోసం కాలనీల్లో విడిచిపెట్టిన స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బాలానగర్‌లో షెడ్ల కూల్చివేత



ఇందిరానగర్‌లో కూల్చివేసిన షెడ్లు

బాలానగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కక్ష్య సాధింపు చర్యలో భాగంగానే బాలానగర్ డివిజన్ ఇందిరానగర్‌లో షెడ్లను కూకట్‌పల్లి టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం కూకట్‌పల్లి వై జంక్షన్ నుంచి ప్రశాంత్‌నగర్, ఇందిరానగర్‌లో షెడ్లు, డబ్బాలు, స్టాళ్లు, బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద వేసిన షెడ్డును అధికారులు కూల్చివేశారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ఘటనా స్థలానికి చేరుకొని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరువ్యాపారాలు చేసుకుంటున్న నిరుపేదలను రోడ్డు పాలు చేయడం సమంజసం కాదన్నారు. దీనిపై కూకట్‌పల్లి ఉప కమిషనర్ కృష్ణయ్యను వివరణ కోరగా.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాలాలు, వర్షపు నీటి కాలువలపై ఏర్పాటు చేసిన డబ్బాలను మాత్రమే తొలగించామని, ఇందులో కక్ష సాధింపు చర్యలేమీ లేవన్నారు.

'దాన గుణాన్ని అలవర్చుకోవాలి'

పేట్‌బషీరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సంపాదనలో కొంత దానం చేసే గుణాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. జీడిమెట్ల గ్రామం బస్టాండ్ వద్ద వాసవీ సేవాదళ్ కొంపల్లి ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వాసవీ సేవాదళ్ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

హైదర్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఛత్రపతి శివాజీనగర్ రోడ్డు నంబర్ -1, 4లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, అంజయ్యయాదవ్, బాలరాజు, రమేష్, పోశెట్టిగౌడ్, రాజేందర్ పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి



మాట్లాడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి

మియాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో గురువారం చంద్ర రాజేశ్వరరావు జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రముఖ రచయిత చంద్రమోహన్‌గౌడ్ రాజేశ్వరరావుపై రచించిన గేయాన్ని సుధాకర్‌రెడ్డి స్వయంగా ఆలపించి విడుదల చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు, కోశాధికారి చెన్నకేశవరావు, ఆరోగ్యకేంద్రం డైరెక్టర్ కె.రజిని, ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి విజయలక్ష్మి, వృద్ధాశ్రమ సలహాకమిటీ సభ్యులు సరస్వతి, రాజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్యులు, పిల్లలతో డాక్టర్ గురువారెడ్డి

వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు ఆధునిక చికిత్స

- కిమ్స్ సన్ ఆస్పత్రిలో 'క్లబ్ ఫుట్'పై అవగాహన

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు ఆధునిక వైద్య చికిత్సలు, సాంకేతికతో సరిచేసి వారు సాధారణ జీవనం గడిపేటట్టు చేయవచ్చని పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ వివరించారు. వరల్డ్ క్లబ్ ఫుట్‌డే సందర్భంగా బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవీ గురవారెడ్డి చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ఫుట్ సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు డాక్టర్ విద్యాసాగర్ పరీక్షలు చేసి చికిత్స అందజేశారు. వంకర కాళ్లతో సరిగా నడవలేకపోవడం, కూర్చోలేక ఇబ్బంది పడుతుంటారని, దీనిని వైద్య పరిభాషలో క్లబ్‌ఫుట్ సమస్యగా పరిగణిస్తారని తెలిపారు. ఇది కొంతమంది పిల్లల్లో వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారికి ఆధునిక శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. క్లబ్‌ఫుట్ సమస్యకు చికిత్స తీసుకుంటున్న చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

హుడా భూమిలో గుడిసెలు వేసేందుకు యత్నం

- అడ్డుకున్న అధికారులు

మియాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హుడా అధీనంలో ఉన్న ప్రశాంత్‌నగర్ సర్వే నంబర్ 100, 101లోగల స్థలంలో గుడిసెలు వేయడానికి పేద మహిళలు యత్నించగా అధికారులు అడ్డుకున్నారు. అద్దెలు కట్టలేక ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటున్నామని, తమను అడ్డుకోవద్దని అధికారులతో మహిళలు వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించేశారు. మహిళలను తీసుకొచ్చిన వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఈఎస్‌సీఐ సెంటినరీ కన్వెన్షన్‌కు సీఎంకు ఆహ్వానం



ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ) గచ్చిబౌలి ప్రాంగణంలో సెంటినరీ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఈఎస్‌సీఐ చైర్మన్ డాక్టర్ జీ.రామేశ్వర్‌రావు ఆహ్వానించారు. గురువారం ముఖ్యమంత్రిని కలిసి ఈఎస్‌సీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

భారీ వర్షం

- రోడ్లు జలమయం..
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్

మియాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి, దుండిగల్, నిజాంపేటలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లు జలపాతాలను తలపించాయి. రోడ్లపై గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఐటీకారిడార్ మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి ప్రాంతాల్లో ప్రధాన రహదారులు వాహనాలతో నిండిపోయాయి. దీప్తిశ్రీనగర్, పాపిరెడ్డి నగర్, శిల్పారామం ఎదుట, అయ్యప్ప సొసైటీలో పలు రహదారులు జలమయమవడంతో అపార్ట్‌మెంట్ల సెల్లార్‌లోకి వరదనీరు చేరింది. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కూలిన చెట్టు

దుండిగల్: బాచుపల్లిలో రెడ్డీ ల్యాబ్స్ ఎదుట చెట్టు కూలి ప్రధాన రహదారిపై పడింది. దీంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. డ్రైనేజీలు పొంగి వరద నీటితో రహదారులపై పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



రెడ్డీ ల్యాబ్స్ ఎదుట రహదారిపై కూలిన చెట్టు

బాచుపల్లిలో 43.0 మిల్లీమీటర్ల వర్షం

రంగారెడ్డి అర్బన్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. బాచుపల్లిలో 43.0 మిల్లీమీటర్లు, గచ్చిబౌలిలో 22.5, హయత్‌నగర్‌లో 19.3, చందానగర్‌లో 18.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.





శేరిలింగంపల్లి, గచ్చిబౌలిలో ట్రాఫిక్ జామ్

రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం : స్పీకర్



త్రోబాల్ పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

హయత్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆవరణలో 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్రీడల పట్ల మక్కువ ఎక్కువ అని అన్నారు. తెలంగాణకు చాంపియన్ షిప్ తీసుకురావాలని క్రీడాకారులను కోరారు. స్పోర్ట్స్ పాలసీని తీసుకురావడానికి నా వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీలకు దేశంలోని 26 రాష్ట్రాల పురుషులు, మహిళా టీంలు వచ్చాయి. మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ చైర్మన్ ప్రేంసాగర్‌రావు, టీఎస్‌పీఎస్‌సీ మాజీ సభ్యుడు విఠల్, అమీర్ అలీఖాన్, అధ్యక్షుడు సత్యం శ్రీరంగం, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణా రాజ్‌పుత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శేరిలింగంపల్లి అభివృద్ధికి కృషి

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చిన శేరిలింగంపల్లి సెగ్మెంట్ ప్రజలకు రుణపడి ఉంటానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో మసీద్‌బండలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ గెలుపునకు కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డిని నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, కన్వీనర్ రాఘవేందర్‌రావు, రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కరరెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, రాధాకృష్ణయాదవ్, ఎల్లేశ్, పద్మ, సీతారామరాజు, రాజుయాదవ్, పర్వతాలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యను వివరిస్తున్న ఆశా వర్కర్లు

పేట్‌బషీరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దుండిగల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేయాలని కుత్బుల్లాపూర్‌లోని ఆశా వర్కర్లు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కోరారు. నియోజకవర్గంలోని గర్భిణులు ప్రసవం కోసం నిలోఫర్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. గాగిల్లాపూర్, దుండిగల్ ప్రాంతాల్లో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయని, వీటిలో ఒకదానిని జీహెచ్ఎంసీ పరిధిలోకి మారిస్తే గర్భిణులకు ఉపయోకరంగా ఉంటుందని ఎమ్మెల్యేకు వివరించారు.

విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిరుపేద గర్భిణుల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు సంక్షేమ సంఘం సభ్యులు, నాయకులు ఎమ్మెల్యేను గురువారం కలిసి స్థానిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

టెక్ మహీంద్రా యూనివర్సిటీ వద్ద కారు బీభత్సం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

దుండిగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): టెక్ మహీంద్రా యూనివర్సిటీ వద్ద గురువారం ఓ కారు బీభత్సం సృష్టించింది. తమిళనాడుకు చెందిన కారు యూనివర్సిటీ మార్గంలో అతివేగంగా వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు ప్రమాదం తప్పింది. దుండిగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



భెల్ టౌన్‌షిప్‌లో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భరణీధర్

భెల్‌కాలనీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. భరణీధర్ రాజా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భెల్ టౌన్‌షిప్‌లో కార్మిక సంఘాలు, పలువురు అధికారులతో కలిసి గురువారం గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులవుదామని ప్రతిజ్ఞ చేసి, మొక్కలను పెంచుదామనే నినాదంతో గాంధీ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, వ్యర్థాలను శుద్ధి చేసి సేంద్రియ ఎరువుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు.చిన్నారులకు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలిజేయడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టవచ్చన్నారు. కార్యక్రమంలో అధికార, గుర్తుంపు కార్మిక సంఘాల నాయకులు, పలు విభాగాల ఉన్నతాధికారులు, కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఔటర్‌పై ప్రపంచ పర్యావరణ దినోత్సవం

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నానక్‌రాంగూడ టోల్ ప్లాజా వద్ద మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం గురించి సిబ్బందికి, కార్మికులకు కంపెనీ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా వివరించారు.

వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి ఎక్కువగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తామని, మొక్కలు నాటుతామని, ఇంధనాన్ని వృథా కానివ్వబోమని, మానవ నిర్మిత విధ్వంసాల నుంచి భూమాతకు రక్షణ కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఐఆర్‌బీకి చెందిన పలువురు సీనియర్ అధికారులు, ప్రాజెక్టు సిబ్బంది, హెచ్ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన జాస్తి మణిసాయి(25) రెండేళ్లుగా స్థానికంగా ఉంటూ స్క్రాప్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపం చెందాడు. గురువారం సాయంత్రం ఇంట్లో గుర్తుతెలియని మందు తాగాడు. మణిసాయికి వరుసకు సోదరుడైన పాండురంగబాబు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఇంటికెళ్లి చూడగా మణిసాయి చనిపోయి ఉన్నాడు. మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాశాడు. పాండురంగబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పై నుంచి పడి కార్మికుడి మృతి

చందానగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంపై నుంచి పడి ఓ కార్మికుడు మృతిచెందాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన రమేష్ సింగ్(40) జీవనోపాధి కోసం నగరానికి వచ్చాడు. చందానగర్ కేఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్, ఫ్రెండ్స్ కాలనీ మధ్యలో రంజన్ వైభవ్ కన్‌స్ట్రక్షన్ నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 11వ అంతస్తులో పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు లిఫ్టు గుంతలోపడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉప ఎన్నికలు ఎప్పుడో?

- గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ
- ఇద్దరు కార్పొరేటర్ల అకాల మరణం
- ఎమ్మెల్యేలుగా ఎన్నికైన మరో ఇద్దరు

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ అయ్యాయి. రెండు స్థానాల్లో కార్పొరేటర్లు మరణించగా.. ఓ కార్పొరేటర్ ఎమ్మెల్సీగా, మరో కార్పొరేటర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. గుడిమల్కాపూర్ నుంచి బీజేపీ తరఫున కార్పొరేటర్‌గా ఎన్నికైన దేవర కరుణాకర్ 2023, జనవరిలో అనారోగ్యంతో మరణించారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెహిదీపట్నం కార్పొరేటర్ మహ్మద్ మాజిద్‌హుస్సేన్(ఎంఐఎం) నాంపల్లి శాసనసభ్యుడిగా, రామ్నాస్‌పుర కార్పొరేటర్ మహ్మద్ ముబీన్ బహదూర్‌పురా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎర్రగడ్డ డివిజన్ నుంచి విజయం సాధించిన ఎంఐఎం కార్పొరేటర్ షాహీన్ బేగం ఇటీవల చనిపోయారు. జీహెచ్ఎంసీ చట్టం 1955 ప్రకారం.. కార్పొరేటర్ మరణించిన నాలుగు నెలల్లో ఉప ఎన్నికలు నిర్వహించాలి. దేవర కరుణాకర్ మరణించి ఏడాదిన్నర కాగా.. మరో ఇద్దరు కార్పొరేటర్లు శాసనసభ్యులుగా ఎన్నికై ఆరు నెలలు దాటింది. అయినా ఇప్పటి వరకు ఉప ఎన్నికలు నిర్వహించలేదు. ఖాళీ అయిన డివిజన్ల వివరాలు పంపుతూ.. ఉప ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు ఎన్నికల సంఘానికి జీహెచ్ఎంసీ లేఖ రాసింది. షాహీన్ బేగం మరణం నేపథ్యంలో గురువారం ఎర్రగడ్డ స్థానం ఖాళీ అయిందని పేర్కొంటూ కమిషనర్ ఆమోదం తీసుకున్నారు. ఎన్నికల విభాగం ద్వారా ఈ ఫైల్‌ను త్వరలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఉప ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందా..? అన్నది చూడాలి.

2,884 ఇంకుడు గుంతల నిర్మాణం

- సమీక్షలో వాటర్‌బోర్డు అధికారుల వెల్లడి

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకర్ల డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పించగా ఇప్పటి వరకు 2,884 కుటుంబాలు ముందుకొచ్చాయని, ఇళ్లలో ఇంకుడు గుంతలను నిర్మించుకున్నాయని వాటర్‌బోర్డు అధికారులు వెల్లడించారు. 296 కుటుంబాలు వినియోగంలో లేనివాటికి మరమ్మతులు చేసుకున్నాయని తెలిపారు. ఇంకుడు గుంతల సర్వేపై ప్రధాన కార్యాలయంలో గురువారం రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇప్పటికే 4,736 కుటుంబాల్లో ఇంకుడు గుంతల నిర్మాణంపై సర్వే చేశారని తెలిపారు. వీరంతా ఆయా కుటుంబాలకు ఇంకుడు గుంతల నిర్మాణం ఆవశ్యకతపై అవగాహన కల్పించారని పేర్కొన్నారు. మిగిలిన 1,852 కుటుంబాలు నిర్మించుకోవాల్సి ఉందని తెలిపారు. వీరంతా నిర్మించుకునేలా సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు, సర్వే సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఇంకుడు గుంతల మాజీ ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ, సింగిల్ విండో సెల్ జీఎం దామోదర్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి'

గాజులరామారం/అల్లాపూర్/కూకట్‌పల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు కుత్బుల్లాపూర్, అల్లాపూర్‌లో, కూకట్‌పల్లి, మూసాపేటలో గురువారం ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్య, సదుపాయాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.

బీసీ రిజర్వేషన్లు, హక్కుల సాధనకు

మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలి



అభివాదం చేస్తున్న ఆర్. కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

పంజాగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు, వాటి హక్కుల సాధన కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలంటూ పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కామారెడ్డి డిక్లరేషన్-సమగ్ర కులగణన' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఐపీఎస్ మాజీ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ సంజీవ్ నాయక్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం ఈనెల 15న ఇందిరాపార్కు వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. బీసీ సంఘాలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని ఆర్.కృష్ణయ్య అన్నారు. సమావేశంలో రాజారాం యాదవ్, వివిధ బీసీ సంఘాల నాయకులు కాటం నర్సింహ యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, సాయిని నరేందర్, బత్తుల సిద్దేశ్వర్, రమేష్ యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు రమణకుమార్, టి.జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.